క్లుప్తంగా

విఘ్నేశ్వరునికి ఇరుముడుల అందజేత



ఇరుముడులను అర్చకులకు అందజేస్తున్న దీక్షధారులు

అయినవిల్లి: 41 రోజులు (మండలం) విఘ్నేశ్వరుని మాలధారణ చేసిన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మిలటరీ మాధవవరం గ్రామస్తులు శుక్రవారంతో దీక్ష పూర్తవడంతో అయినవిల్లి స్వామికి ఇరుముడులు సమర్పించారు. మిలటరీ మాధవవరంలో మొత్తం 30 మంది విఘ్నేశ్వరుని దీక్ష తీసుకున్నారు. 41 రోజులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి శుక్రవారం స్వామిని దర్శించుకుని స్వామికి ఇరుముడులు సమర్పించారు. స్వామిని ప్రసన్నం చేసుకుని తాము కోరిన కోర్కెలు తీర్చుకొనేందుకు ఈ మాలధారణ చేసినట్లు వారు తెలిపారు. స్వామివారి ప్రసాదం స్వీకరించారు. అనంతరం తమ దీక్షను ముగించారు. అనంతరం కొంత మంది భక్తులు కాణిపాకంలోని వరసిద్ధివినాయకుని దర్శనం కోసం బయలుదేరారు.

రేపు ఉచిత న్యూరో వైద్య శిబిరం

కొత్తపేట: స్థానిక వెంకట సందీప్ 'ఐ' క్లినిక్ ప్రాథమిక కంటి ఆస్పత్రి వద్ద సందీప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత న్యూరో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్ బండారు పెదవెర్రియ్య (చిట్టిబాబు) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాజమహేంద్రవరం సిటీ న్యూరో కేర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించే ఈ శిబిరంలో ఆస్పత్రి వైద్యుడు ఎస్‌జే బాలపరమేశ్వరరావు మెదడు, నరాలు, వెన్నెముక సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా న్యూరోపతి సెన్సిటివిటి టెస్ట్ ఉచితంగా చేస్తారని తెలిపారు. అలాగే ఉచిత పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్ చేస్తారని తెలిపారు. ఆయా వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శిబిరం నిర్వాహకుడు చిట్టిబాబు కోరారు.

17, 18 తేదీల్లో క్రీడా పోటీలు

అయినవిల్లి: మండల స్థాయిలో జరిగే క్రీడా పోటీలు ఈ నెల 17, 18 తేదీల్లో జరుగుతాయని శుక్రవారం నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల, మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తారు. క్రీడా పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ వంటి క్రీడలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో విజేతలను కొత్తపేట డివిజన్ కేంద్రంలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన 'పాలూరి'

పి.గన్నవరం: నాగుల్లంక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్‌గా పాలూరి ఫణిధరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కడలి శ్రీరామ నరసింహమూర్తి, బయ్యా వినోద్‌లు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి, నాయకులు భీమాల వెంకటేశ్వరరావు, ఆరుమిల్లి రాంబాబు, గుడాల వెంకటరమణ, పాలూరి వీరభద్రం, నూకల విశ్వేశ్వరరావు, గ్రంధి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందిస్తాం



బాధ్యతలు స్వీకరించిన నగరం సొసైటీ చైర్మన్ శ్రీనివాస్

మామిడికుదురు: రైతులకు మెరుగైన సేవలందిస్తామని నగరం సొసైటీ చైర్మన్ యాలి శ్రీనివాస్ చెప్పారు. చైర్మన్‌గా శ్రీనివాస్, సభ్యులుగా కాకి వాసు, మట్టా సత్తిబాబు నియమితులయ్యారు. శుక్రవారం మామిడికుదురులోని నగరం సొసైటీలో బాధ్యతలు చేపట్టారు. పాశర్లపూడి సొసైటీ చైర్మన్‌గా మంద గాంధీ, సభ్యులుగా యర్రంశెట్టి దుర్గా రాజేశ్వరి, బొంతు మహాలక్ష్మినాగకుమారి, పాశర్లపూడిలంక సొసైటీ చైర్మన్‌గా అప్పన వీరబాబు, సభ్యులుగా ఇంజేటి నాగేశ్వరరావు, కుడుపూడి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు.

ఏపీఎన్జీఓ సంఘ సభ్యత్వ నమోదుకు శ్రీకారం

రాజోలు: ఏపీఎన్జీఓ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని రాజోలు తాలూకా ఎన్జీఓ సంఘ అధ్యక్షుడు డి.సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం రాజోలు సబ్ ట్రెజరీ కార్యాలయంలో తాలూకా సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ నెల 18 నుంచి జరిగే సభ్యత్వ నమోదులో అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులతో పాటు గ్రామ సచివాలయ ఉద్యోగులు కూడా సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. బి.మూర్తి, కె.శ్రీనివాసరావు, భాస్కర్, త్రినాథ్ పాల్గొన్నారు.

కొరవడిన తనిఖీలు

- లోపించిన పర్యవేక్షణ
- ప్రజా సంక్షేమంపై లేని శ్రద్ధ
- క్షేత్రస్థాయిలో పర్యటించని పలు శాఖల అధికారులు



అంబాజీపేటలో రోడ్డు పక్కన విక్రయిస్తున్న పానీపూరీ తోపుడుబండి

అంబాజీపేట: ప్రజారోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి శాఖ పరిధిలో తనిఖీలు చేపట్టాల్సిన అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ముఖ్యంగా తూనికలు–కొలతలు, ఆరోగ్యం తదితర శాఖల పరిధిలో అధికారులలో నిర్లిప్తత నెలకొంది. ఆయా శాఖల అధికారులు కనీసం నెలకు ఒక్కసారి కూడా తనిఖీలు చేయడం లేదంటే వారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పి.గన్నవరం. రాజోలు, కొత్తపేట నియోజకవర్గంలోని 11 మండలాల్లో సుమారు హోటళ్లు, రోడ్డు ప్రక్కన తోపుడు బండ్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు సుమారు 3 వేలకు పైగా దుకాణాలు ఉన్నాయి.

ఆహార శుభ్రతపై పర్యవేక్షణ ఏదీ..?

హోటళ్లు, రోడ్డు వెంబడి తోపుడు బండ్లపై నిర్వహించే తినే పదార్థాల వ్యాపారాలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ప్రతి రోజూ మండల ప్రజలతో పాటు వివిధ గ్రామాల నుంచి వేలాది మంది వస్తుంటారు. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లు, కర్రీ పాయింట్‌లలో పరిశుభ్రత పాటించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. వీరిని తనిఖీ చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటున్నారు. మాంసం, చికెన్ తదితర వాటిని ఫ్రిజ్లో నిల్వ ఉంచి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నాణ్యత లోపిస్తోంది. రోడ్డు వెంబడి తోపుడు బండ్లలో వినియోగించిన నూనెను మళ్లీ మళ్లీ వినియోగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

"హోటల్స్, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పరిశుభ్రత పాటించని వాటిని గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని జరిమానా విధిస్తాం. పరిశుభ్రతపై ఆయా దుకాణదారులకు అవగాహన కల్పిస్తాం."

– రామయ్య, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, కొత్తపేట

వేసిందే తూకం.. చెప్పిందే ధర

మండలాల్లో, గ్రామాల్లో తూనికలు, కొలతల మోసాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. దుకాణాల్లో కాటాలు, తూకం రాళ్లను తనిఖీలు చేయాల్సిన అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో వ్యాపారులు వేసిందే తూకం.. చెప్పిందే ధర అన్నట్లుగా మారింది. ఫలితంగా వినియోగదారులు నష్టపోతున్నారు. తూనికల శాఖ అధికారులు నెలల తరబడి కూడా తనిఖీలు చేసిన దాఖలాలు కనిపించడం లేదు.

తనిఖీలు శూన్యం

మండలంలో ఎరువులు, పురుగు మందులపై నిరంతర తనిఖీలు శూన్యం. వ్యవసాయ సీజన్లో సంబంధిత అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. దుకాణాల్లో ధరల పట్టిక కనిపించడం లేదు. రైతులకు రశీదులు ఇవ్వడం లేదు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఏటా నాణ్యత లేని పురుగు మందులు వినియోగించి రైతులు నష్టపోతున్నారు.

ఎంపీడీఓగా లక్ష్మీకల్యాణి



ఎంపీడీవోకు స్వాగతం పలికిన సూపరింటెండెంట్ మిల్టన్, సిబ్బంది

మలికిపురం: మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా సీహెచ్ లక్ష్మీకల్యాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ముమ్మిడివరం మండల డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతిపై మలికిపురం ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. మలికిపురం ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న మలికిపురం మండల డిప్యూటీ ఎంపీడీవో జి.మల్లికార్జునరావు పి.గన్నవరం ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. లక్ష్మీకళ్యాణికి మండల పరిషత్ పరిపాలన అధికారి జి.మిల్టన్, సిబ్బంది స్వాగతం పలికారు. మండలంలోని వివిధ పంచాయతీ సెక్రటరీలు, మండల స్థాయి అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఏలూరి లావణ్య సత్యలక్ష్మి, గంధం లక్ష్మణ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫెన్సింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయిని నారిన ఛాయా ప్రసూనాంబ శుక్రవారం తెలిపారు. మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో జరిగిన పై పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు వారు అర్హత సాధించినట్టు ఆమె పేర్కొన్నారు. పాఠశాల పీడీ కె.భాస్కరరావు పాల్గొన్నారు. కాగా విద్యార్థులను పలువురు అభినందించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలి



కిషోర్

పి.గన్నవరం: ప్రభుత్వ వైద్య కళాశాలలను, ఆరోగ్య సంరక్షణ సేవలను ప్రైవేటీకరించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పి.గన్నవరం మండలం చాకలిపాలెంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కిషోర్ మాట్లాడుతూ వైద్య కళాశాలల నిర్మాణాన్ని, నిర్వాహణను ప్రభుత్వం ఆధ్వర్యంలోనే చేపట్టాలన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. వైద్య విద్యను ప్రైవేటీకరించడం వల్ల పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మిగిలిపోతుందన్నారు. ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వ వైద్య కళాశాలల నియంత్రణను అప్పగించడం వల్ల ఫీజులు అధికమవడం, జవాబుదారీతనం తగ్గడం, సేవ కంటే ఆదాయానికే ప్రాధాన్యత ఇవ్వడంతో పేద విద్యార్థులకు విద్య, రోగులకు వైద్యం అందుబాటులో ఉండవని వివరించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని కిషోర్ పిలుపునిచ్చారు.

ఇంటింటా సర్వే నిర్వహించలేం



మామిడికుదురులో వినతిపత్రం ఇచ్చిన సచివాలయం ఉద్యోగులు

మామిడికుదురు: ఇంటింటికీ వెళ్లి సర్వే చేయలేమని పేర్కొంటూ మామిడికుదురు మండలంలోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు శుక్రవారం ఎంపీడీఓ జి.భవానికి వినతిపత్రం ఇచ్చారు. తమ కుటుంబాల మేలు కోరి వెనక్కు తగ్గే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్ర కమిటీ తరపున ఉద్యోగుల నిబంధనలకు కట్టుబడి ఉన్నతాధికారులకు రెండు వారాల సమయంతో ముందస్తు నోటీసులు ఇచ్చామన్నారు. విధులను పూర్తి చేస్తామని, కానీ ఇంటింటికీ సర్వే మాత్రం తమ వల్ల కాదని తేల్చి చెప్పారు. వాట్సాప్ గవర్నెన్స్‌లో భాగంగా వాట్సాప్ సర్వీసులను సచివాలయంలో ఉంటూ ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

స్మార్ట్ కార్డుల్లో తప్పిదాలను సరి చేయాలి

మామిడికుదురు: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల్లో ఉన్న తప్పిదాలను తక్షణమే సవరించాలని మాల మహానాడు డిమాండ్ చేసింది. దీనిపై మామిడికుదురు తహసీల్దార్ పి.సునీల్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరును పలు సందర్భాల్లో వక్రీకరించారని మాల మహానాడు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల్లోనే గెజిట్‌ను ధిక్కరిస్తే ఎలా అని ప్రశ్నించారు. అంబేడ్కర్ పేరు ప్రస్తావించకుండా కేవలం కోనసీమ జిల్లా అని ప్రచురించడం బాధాకరమని మాల మహానాడు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణం అధికారులు స్పందించాలన్నారు. ప్రతి స్మార్ట్ రేషన్ కార్డులోనూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అని ముద్రించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బొంతు చందు, గెడ్డం రమేష్, గెడ్డం రాంబాబు, ప్రవీణ్, కుంచే పణీంద్ర, చిల్లే నవీన్‌కుమార్ ఉన్నారు.

పి.గన్నవరం: మండలంలోని కె.ఏనుగుపల్లిలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఆర్ఐ వెన్నపు వర్మ, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, తోరం వీవీ సత్యనారాయణ, ఎంపీటీసీ కొల్లే సూర్యనారాయణ, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, తోలేటి సత్తిబాబు, శేరు శ్రీనుబాబు, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన కమిటీకి అభినందనలు



జ్ఞాపిక అందుకుంటున్న ఉత్సవ కమిటీ చైర్మన్ కాసు శ్రీనివాస్

రాజోలు: గణేష్ నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించినందుకు రాష్ట్ర గణేష్ నిమజ్జన కమిటీ రాజోలు తాలూకా గణేష్ నిమజ్జన కమిటీని అభినందించింది. ఈ మేరకు అమలాపురంలో జరిగిన సమావేశంలో జిల్లా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భానుప్రకాష్ చేతుల మీదుగా రాజోలు తాలూకా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ జ్ఞాపిక అందుకున్నారు. రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని 172 వినాయక విగ్రహాలను రాజోలు వశిష్టానదీ తీరంలో నిమజ్జనం చేసి ఉత్సవాలను విజయవంతం చేయడంపై అభినందించారు. అడబాల వెంకటేశ్వరరావు, దార్ల పెదబాబు, రాజా నాగరత్నకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, సుందర బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ టీచర్స్ సభ్యత్వ నమోదు

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెం, టేకిశెట్టిపాలెం, ఉయ్యూరువారి మెరక, మోరి గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల వద్ద పీఆర్టీయూ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రధాన డిమాండ్ అయిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 2003 డీఎస్సీ టీచర్లకు జాప్యం లేకుండా పాత పింఛన్‌ను వర్తింపచేయాలని, మనబడి, మన భవిష్యత్తులో నిర్మించబడ్డ అసంపూర్తి నిర్మాణాలకు, రిపేర్లకు లాక్ చేయబడిన ఫండ్స్‌ను వినియోగించుకునేలా అనుమతులు ఇవ్వాలని టీచర్స్ తన దృష్టికి తెచ్చినట్టు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి దీపాటి సురేష్‌బాబు తెలిపారు. వీటిని అధికారులు, సంఘ పెద్దల దృష్టికి తీసుకువెళతానన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ పంగం బ్రహ్మాజీరావు, పిల్లి హేమ సుందర్‌రావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

మోదీ హయాంలోనే సంక్షేమం

రాజోలు/కొత్తపేట/సఖినేటిపల్లి: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కూనవరంలో మండల బీజేపీ అధ్యక్షురాలు చెల్లింగి దుర్గాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈనెల 17 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు సేవా పక్షోత్సవాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మోదీ జీవిత చరిత్ర వివరించడం, మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. మాలే శ్రీనివాసనగేష్, అడబాల రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు చెల్లింగి త్రినాథ్ పాల్గొన్నారు.

'నాండ్ర'కు ఘన సత్కారం



నాగమోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అలమూరు: ఇటీవల వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన నాండ్ర నాగమోహన్‌రెడ్డికి ఘన సత్కారం జరిగింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పిలుపు మేరకు మండలంలోని చెముడులంకలో మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు అధ్యక్షతన సమావేశం జరిగింది. రాష్ట్ర స్థాయి పదవి వరించిన నాగమోహన్‌రెడ్డిని పార్టీ శ్రేణులందరూ దుశ్శాలువా, పూలమాలలు వేసి సత్కరించారు. వైఎస్సార్ సీపీ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గళం విప్పుతూ ప్రజా మద్దతు కూడగడుతున్న మండల కన్వీనర్ తమ్మనను కూడా పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ బుడ్డిగ వీర వెంకట్రావు, తాడి మెహర్‌ఆదిత్యరెడ్డి, దొండపాటి వీర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బైక్ విన్యాసాలు చేసే యువకులకు గుణపాఠం

రాజోలు: బైక్‌లను అతివేగంగా నడుపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న పలువురు యువకులకు రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ శుక్రవారం గుణపాఠం చెప్పారు. రోడ్లపై ఇష్టానుసారంగా మోటార్‌సైకిళ్లను మితిమీరిన వేగంతో నడుపుతున్న యువకులను గుర్తించి వారిని రాజోలు సర్కిల్ కార్యాలయానికి తీసుకుని వచ్చారు. వీరిలో కొందరు బైక్ రేసు విన్యాసాలపై శిక్షణ తీసుకుని రాజోలు పరిధిలోని నేషనల్ హైవేలపై మోటార్ సైకిల్ ఫీట్లు చేస్తున్నారు. మితిమీరిన వేగంగా మోటార్‌సైకిళ్లు నడపడం, సైలెన్సర్లు తీసేసి విపరీతమైన ధ్వనితో పబ్లిక్‌లో న్యూసెన్స్ చేస్తే సహించేది లేదని యువకులను హెచ్చరించారు. బైక్ రేస్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడిపినా, మోటార్‌సైకిళ్లకు సరైన పత్రాలు లేకపోయినా వాటిని సీజ్ చేసి సంబంధిత యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పంచాయతీ నిధులతో మౌలిక సదుపాయాలు

మామిడికుదురు: గ్రామ పంచాయతీ నిధులతో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4.50 లక్షలతో నిర్మించిన పాంచాల రేవును సర్పంచ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తాతకాపు మాట్లాడుతూ ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, స్థానికులు విళ్ల సుబ్బారావు, గోకవరపు నాగేశ్వరరావు, పెద్దింటి సత్యశింగరాచార్యులు, కడలి నూకరాజు పాల్గొన్నారు.

మత్తు వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి



పి.గన్నవరం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం: స్థానిక సీహెచ్‌సీలో ఎనస్థీషియన్(మత్తు వైద్యుడు) అందుబాటులో ఉండటం లేదని, దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి సహా పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు డాక్టర్ ఆస్పత్రికి ఇన్‌టైమ్‌లో రాకపోవడం వల్ల ఆపరేషన్లు అవసరమయ్యే రోగులను అమలాపురం ఏరియా ఆస్పత్రికి పంపుతున్నారని వారు ఆరోపించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ, సభ్యులు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వాస్పత్రికి ఎంతో పేరు ఉందన్నారు. ఎనస్థీషియన్ సాయి మాధురి పనితీరుపై రోగులు ఇబ్బందులు పడుతున్నారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ ఎనస్థీషియన్ పనితీరుపై చాలా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తాను డీసీహెచ్‌కి వివరించినట్టు వెల్లడించారు. దీంతో ఆమెను వేరే ఆస్పత్రికి బదిలీపై పంపినా, కమిషనర్ అనుమతితో మళ్లీ ఇదే ఆస్పత్రికి వచ్చి విధుల్లో చేరారని ఎమ్మెల్యే వివరించారు. ఆస్పత్రిలో ఎవరిని అడిగినా ఆమె ఇన్‌టైమ్‌లో ఆస్పత్రికి రావడం లేదని చెబుతున్నారన్నారు. రాత్రి వేళల్లో అత్యవర ఆపరేషన్లు చేయాల్సినా ఆమె అందుబాటులో ఉండరన్నారు. ఇన్‌టైంలోనే అందుబాటులో లేనప్పుడు, రాత్రి వేళల్లో ఎలా వస్తారని వస్తారని ఎమ్మెల్యే అన్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే చెప్పారు. సమావేశం దృష్టికి సభ్యులు తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఇన్‌చార్జి ఎంపీడీఓ జి.ఉమామహేశ్వరరావు, నగరం ఏఎంసీ చైర్‌పర్సన్ పెనుమాల లక్ష్మి, వైస్ ఎంపీపీ చెల్లుబోయిన గంగాదేవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా సఖి వన్‌స్టాప్ సేవలు

రాజోలు: సఖి వన్‌స్టాప్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలు మహిళలకు ఎంతో అండగా నిలుస్తున్నాయని రాజోలు సీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఇందిర అన్నారు. శుక్రవారం రాజోలులో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సఖి వన్‌స్టాప్ సేవలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీడీపీఓ ఇందిర మాట్లాడుతూ బాధిత మహిళలకు వన్‌స్టాప్ సెంటర్ ద్వారా అని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తారన్నారు. గృహహింస, అక్రమ రవాణా, వరకట్న వేధింపులు, పని చేసే చోట లైంగిక వేధింపులు తదితర సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు వైద్య సదుపాయంతో పాటు న్యాయ సహకారం అందిస్తామన్నారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ కె.అంబికాదేవి, సూపర్‌వైజర్లు, పారా మెడికల్, పారా లీగల్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ ఉపయోగిస్తే ఖర్చు ఆదా



ముక్కామలలో డ్రోన్‌తో పిచికారీ విధానాన్ని వివరిస్తున్న అధికారులు

అంబాజీపేట: వ్యవసాయ సాగులో చీడ పీడల నివారణకు డ్రోన్ ఉపయోగించడం వల్ల సమయంతో పాటు ఖర్చు ఆదా అవుతుందని ఎన్ఎఫ్ఏ రాధిక, ఏఓ కె.ధర్మప్రసాద్ రైతులకు వివరించారు. ముక్కామలలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో చీడపీడల నివారణకు డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానాన్ని రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ అగ్నిఅస్త్రంను డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం వల్ల పొడ తెగులు, మెడ విరుపు తెగుళ్లను నివారించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ కషాయాలను రైతులు సొంతంగా తయారు చేసుకోవచ్చన్నారు. అందుకుగాను రైతులకు ఎంటీ నాగవేణి, దుర్గాలక్ష్మి వివరిస్తారన్నారు. అనంతరం తెగుళ్ల నివారణకు మారేడు పత్ర కషాయాన్ని డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏ తేజ, సీఆర్పీలు కె.మల్లేశ్వరి, ఎం.సరితాశ్రీలక్ష్మి, రైతులు పిల్లా సూరిబాబు, యడ్ల వెంకటేశ్వరరావు, సుంకర జ్యోతి, మట్టపర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

అంటువ్యాధులు అరికడదాం



పినపళ్లలో దోమల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

అలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు వీలుగా ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించడం ద్వారా దోమల సంచారాన్ని అరికట్టి అంటువ్యాధులను నిర్మూలించవచ్చని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎన్.లక్ష్మీస్నేహలత, బి.అనంత రామకృష్ణ, డి.సాయికిషోర్, బి.భాగ్యశ్రీ అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. ప్లకార్డులు ప్రదర్శించి దోమల వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. అలాగే రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, ఆర్ బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

లింకు రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలి

అంబాజీపేట: రైతులు పండించిన పంటను మార్కెట్‌కు తరలించేందుకు అనువుగా ఉండే లింకు రోడ్లను నిర్మించేందుకు మార్కెట్ కమిటీ పాలకవర్గం కృషి చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ అధికారులు, పాలకవర్గం సమన్వయంతో పనిచేసి రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.విశాలాక్షి, కార్యదర్శి ఐ.రమేష్,. ఏడీఏ సీహెచ్‌డీ విజయ్‌కుమార్, వైస్ చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బీరువాల బహూకరణ



బీరువాకు పూజలు చేస్తున్న హెచ్ఎం నాగప్రసాద్

మామిడికుదురు: లూటుకుర్రు జెడ్పీహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థులు శుక్రవారం రెండు బీరువాలను బహూకరించారు. 1981–85 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.60 వేలతో కొన్న బీరువాలను స్కూల్‌కు అందించారు. వీటికి హెచ్ఎం గాడేపల్లి నాగప్రసాద్ పూజలు చేసి ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు స్కూల్ అభివృద్ధికి ఎంతో సహకారం అందిస్తున్నారని వారిని హెచ్ఎం అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కట్టా వెంకటేశ్వరరావు, విళ్ల గోపాలకృష్ణ, బొంతు బాబూరావు, గోకవరపు వెంకన్నబాబు, ఉపాధ్యాయుల రవి, బందన సత్యనారాయణ, యు.కామేశ్వరి, కైరున్నీసా బేగం పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంఘ ప్రధాన కార్యదర్శిగా 'కాండ్రేగుల'



రాజోలు: స్థానిక తాలూకా శెట్టిబలిజ సంఘ ప్రధాన కార్యదర్శిగా కాండ్రేగుల రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. సంఘ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాము తెలిపారు. సంఘ సమన్వయకర్త గుబ్బల శ్రీనివాస్, కోశాధికారి బొక్కా వెంకటేశ్వరరావు, చిట్టూరి గణేష్, బొక్కా ఏడుకొండలు, కడలి సత్యనారాయణ, కాండ్రేగుల శ్రీనివాస్, పెచ్చెట్టి గణేశ్వరరావు పాల్గొన్నారు.